PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu


# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :163 | పేజీలు : 8 | వెల రూ.5 | మంగళవారం. 30.06.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@PrabhathaSuryuduNews
70326 93467
WANTED REPORTERS




## వానాకాలం సాగుకు..
# పెట్టుబడి సాయం

ప్రభాత సూర్యుడు

## రేపే రైతు భరోసా నిధులు విడుదల

రాష్ట్రంలోని అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులను సిద్ధం చేసింది. వానాకాలం సీజన్ 'రైతు భరోసా' పథకం పంపిణీ ప్రక్రియ ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుంది. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పంపిణీ సదస్సుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించాలని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. వెంటనే సంబంధిత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ సమావేశం రేపు సాయంత్రం 4 గంటలకు జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రైతులు తమ తమ రైతు వేదికల నుంచి ఈ సమావేశంలో పాల్గొంటారు. ఇక్కడ నుంచే రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులను ఆయా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు.. కాగా వాస్తవానికి ఖమ్మం జిల్లాలోని మత్కేపల్లిలో భారీ బహిరంగ సభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎకరాకు రూ.6 వేల చొప్పున జమ చేయాల్సి ఉంది. అయితే అక్కడ భారీ వర్షాలు కురువడంతో వేదికను హైదరాబాద్ కు మార్పు చేశారు.

- హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమం
- సీఎం రేవంత్ చేతుల మీదుగా రైతుల ఖాతాల్లో జమ
- జులై 15లోపు రైతులందరికీ జమ చేసేలా ప్రణాళిక
- బ్యాంకుల్లో క్యాష్ సర్దుబాటు చేయాలని ఆర్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- ఉద్యోగుల బకాయిలకు ₹2 వేల కోట్లు
- వేతనాలు, పెన్షన్లు, స్కీమ్‌లతో జులై ఒక్క నెలలోనే ₹20 వేల కోట్లు ఖర్చు
- ఆర్‌బీఐ నుంచి ₹11,500 కోట్ల రుణం
- రాష్ట్ర సొంత ఆదాయం సర్దుబాటుకు చర్యలు

### రూ. తొమ్మిది వేల కోట్లు రెడీ

రైతుల ఖాతాల్లో నగదు జమ చేసేందుకుగాను ఆర్థిక శాఖ ఇప్పటికే రూ.9 వేల కోట్లు సిద్ధం చేసింది. రాబోయే జజూలై 15వ తేదీ కల్లా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన రైతులందరి ఖాతాల్లోకి ఈ నిధులు పూర్తిగా చేరేలా ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికను రూపొందించుకొని ముందుకు సాగుతోంది. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, బ్యాంకుల ద్వారా నేరుగా నగదు బదిలీ చేసేందుకు అవసరమైన అన్ని రకాల సాంకేతిక, పరిపాలనాపరమైన అనుమతులను సంబంధిత అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. రైతు భరోసా నిధులు మొత్తం 10 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తుగా పలు కీలక చర్యలు చేపట్టింది.

### 70 లక్షల మంది రైతులకు.. కోటి 50 లక్షల ఎకరాలకు

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 లక్షల మంది రైతులకు.. కోటి 50 లక్షల ఎకరాలకు.. ఎకరాకు 6 వేల చొప్పున జమ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. పెట్టుబడి సాయంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించి నిధులు కేటాయించింది. ఉద్యోగులకు దీర్ఘకాలంగా బకాయి ఉన్న వివిధ రకాల ఏరియర్స్ చెల్లింపుల కోసం ప్రతినెలా ఇస్తామని చెప్పిన దాదాపు రూ.2వేల కోట్లను ప్రత్యేకంగా సిద్ధం చేసింది. ఈ బకాయిలను కూడా జూలై నెలలోనే పూర్తిగా క్లియర్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అటు అన్నదాతలకు పెట్టుబడి సాయం అందిస్తూనే, ఇటు ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించే ఉద్యోగుల బకాయిలను చెల్లించనుంది. రాబోయే జూలై నెలలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, పరిపాలన కోసం అత్యంత భారీ స్థాయిలో నిధులను ఖర్చు చేయబోతోంది. సాధారణంగా వచ్చే నెలవారీ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లకు రూ. 6 వేల కోట్లతోపాటు రైతు భరోసా, ఉద్యోగుల బకాయిలులాంటి ఇతర ముఖ్యమైన పథకాలను కలుపుకొని జూలై ఒక్క నెలలోనే దాదాపు రూ.20వేల కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ అంచనా వేసింది.

### ఆర్థిక ఇబ్బందులు రాకుండా..

ఇంతటి భారీ మొత్తాన్ని ఒకేసారి సర్దుబాటు చేయడం అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ కావడంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దీనికోసం ఆర్‌బీఐ నుంచి సుమారు రూ.11,500 కోట్ల మేర రుణం సేకరించడంతోపాటు రాష్ట్రానికి వచ్చే సొంత ఆదాయ వనరులను (స్టేట్ ఓన్ రెవెన్యూ) కూడా దీనికి తగ్గట్టుగా మళ్లించనున్నారు. ఈ రెండు మార్గాల ద్వారా లభించే నిధులను సమర్థవంతంగా మేనేజ్ చేస్తూ, ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు రాకుండా జూలై నెల ఖర్చులను అధిగమించేందుకు ఆర్థిక శాఖపూర్తి\కసరత్తు ఇప్పటికే పూర్తి చేసింది.

### సీఎం రైతు ఆశీర్వాద సభ రద్దు
### భారీ వర్షా లే కారణం

ఖమ్మం బ్యూరో, ఆంధ్రప్రభ : రైతు భరోసా పంపిణీ కోసం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం లో ఈ నెల 30న జరగాల్సిన రైతు ఆశీర్వాద సభ భారీ వర్షాల కారణంగా రద్దయింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురం వద్ద సభ నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో సభా ప్రాంగణంలో వర్షం నిలిచి టెంట్లు కూలిపోయాయి. ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని రైతు భరోసా పథకం పంపిణీని ప్రారంభించాల్సి ఉంది. వర్షాల కారణంగా సభను రద్దు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ఇదే సభను రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా పంపిణీ సదస్సుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. వెంటనే సంబంధిత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



## రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు - 2047' సాధ్యం: మంత్రి సీతక్క



న్యూఢిల్లీ, జూన్ 29:ప్రభాత సూర్యుడు వీబీ జీ రామ్ జీ( పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. సోమవారం ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం కొనసాగించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం 60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. VB G RAM G™పై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు-2047' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు.


## డూప్లికేట్ ఓట్లతోనే రేవంత్‌రెడ్డి గెలిచారని మా అనుమానం: కవిత



హైదరాబాద్, జూన్ 29 :ప్రభాత సూర్యుడు దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) జరిగిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. బోధన్ నియోజకవర్గంలో ఏడాదిలో 7 వేల ఓట్లు తీసేశారని.. ఈ విషయంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ వేదికగా కవిత మీడియాతో మాట్లాడారు. సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని.. వీటిని తొలగించేందుకు ఏడేళ్లు పట్టిందని ప్రస్తావించారు.

## సీషెల్స్ స్వాతంత్ర్య వేడుకల్లో
# భారత సైనిక దళాల కవాతు..

### హాజరైన ప్రధాని మోదీ



విక్టోరియా: ప్రభాత సూర్యుడు భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సోమవారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబడటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు.

# వర్షాకాల ట్రాఫిక్ సమస్యల నివారణకు ముందస్తు చర్యలు

## ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా సమన్వయంతో పనిచేయాలి : సీపీ డా. ఎం. రమేష్

సైబరాబాద్ కమిషనరేట్ జూన్ 29 ప్రభాత సూర్యుడువర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలు, వాటర్ లాగింగ్ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని వాటర్ లాగింగ్ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌కు చెందిన సిబ్బందిని ట్రాఫిక్ విధుల్లో సమర్థవంతంగా వినియోగించడంపై సమీక్ష నిర్వహించిన కమిషనర్, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో వారి పాత్ర, స్పందన తీరు, విధుల నిర్వహణపై అధికారులతో చర్చించి అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. జంక్షన్ల వద్ద ఫ్రీ లెఫ్ట్‌లు, యూ-టర్న్‌లను అడ్డుకునే వాహనాలపై, రాంగ్ రూట్‌లో ప్రయాణించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సాఫీగా సాగేలా చూడాలని సూచించారు. వాటర్ లాగింగ్ సమస్యలు తరచుగా ఎదురయ్యే ప్రాంతాలపై సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్ రూపొందించాలని, రోడ్డు తవ్వకాల పనులకు ముందు ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొన్నారు. విప్రో జంక్షన్, డీఎల్ఎఫ్ జంక్షన్, షాపూర్‌నగర్, కూకట్‌పల్లి వై-జంక్షన్, మియాపూర్, నిజాంపేట్ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి వాటిని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది తప్పనిసరిగా రిఫ్లెక్టివ్ జాకెట్లు, రెయిన్ కోట్లు ధరించాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్‌సీఎస్‌సీ సీఈఓ నవేద్, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.






# ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం పరిశీలన

## ప్రతి ఓటరు వివరాలు ధృవీకరించుకోవాలి
## జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి





శామీర్‌పేట్, జూన్ 29 ప్రభాత సూర్యుడుప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా జరుగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియను జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి పరిశీలించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్‌పేట్ డివిజన్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి కార్యక్రమం నిర్వహణ తీరును సమీక్షించారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం ఐదో రోజు సందర్భంగా తూంకుంట, మందాయిపల్లి, హకీంపేట్, సింగాయిపల్లి, ఉప్పరపల్లి, బాబాగూడ ప్రాంతాల్లోని 138, 139, 140, 151, 152, 159, 160, 163, 164, 165, 166 పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్‌ఓ పి. మధుసూధన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తూ ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ వ్యక్తిగత వివరాలను సరిచూసుకొని, బీఎల్‌ఓలు అందజేసే ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్లు, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణ వంటి అంశాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని పరిరక్షించుకోవడంలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ పి. మధుసూధన్ రెడ్డి, సూపర్‌వైజర్ జానీ, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# చదివిన బడికి మధురమైన కానుక. పూర్వ విద్యార్థి గొప్ప మనసు

**గడ్డం సాయికుమార్**

ములుగు జూన్ 29, ప్రభాత సూర్యుడుములుగు జిల్లా వెంకటాపురం మండలంలో తాను ఒకప్పుడు అక్షరాభ్యాసం చేసిన ప్రాథమిక పాఠశాల ఎం పి పి ఎస్ మరికాల కొత్తూరు ను మరువకుండా, ఆ పాఠశాలను సందర్శించిన పూర్వ విద్యార్థి ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్న గడ్డం సాయికుమార్ చిన్నారులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. విద్యను అందించిన బడికి కృతజ్ఞతగా చేసిన ఈ చిన్న సహాయం, విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు నింపింది. ఇలాంటి పూర్వ విద్యార్థుల సహకారం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు గొప్ప ప్రేరణగా నిలుస్తుంది. అంతేకాకుండా, విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడి, "బాగా చదువుకుంటే జీవితంలో ఎంతటి ఉన్నత స్థాయికైనా చేరుకోవచ్చు. క్రమశిక్షణ, కష్టపడి చదవడం, పెద్దల పట్ల గౌరవం ఉంటే విజయం తప్పకుండా మీ సొంతమవుతుంది అంటూ వారికి ప్రేరణనిచ్చారు. ఆయన మాటలు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. చదివిన పాఠశాలను మరువకుండా తిరిగి వచ్చి, విద్యార్థులకు చేయూతనిస్తూ వారికి స్ఫూర్తినివ్వడం నిజంగా అభినందనీయం.




# ఏఎంఆర్ లెగసీ వెంచర్‌లో ముదురుతున్న నాలా కబ్జా లొల్లి

## - ఇరిగేషన్ శాఖ మార్కింగ్‌పై కొత్త సందేహాలు
## - సహజ ప్రవాహాన్ని పక్కనబెట్టి కొత్త మార్గం చూపుతున్నారంటూ ఆరోపణలు
## - 'అసలు నాలా ఎక్కడ..?' అంటూ గ్రామస్తుల ప్రశ్నలు

అబ్దుల్లాపూర్‌మెట్ -- ప్రభాత సూర్యుడు గౌరెల్లి గ్రామ పరిధిలోని ఏఎంఆర్ లెగసీ రియల్ వెంచర్‌లో నాలా కబ్జా వివాదం రోజురోజుకు ముదురుతోంది. ఇటీవల నాలా పూడ్చివేసి విల్లా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన ఇరిగేషన్ శాఖ ఏఎంఆర్ లెగసీ రియల్ సంస్థ యాజమాన్యానికి గత శుక్రవారం నోటీసులు జారీ చేయగా, సోమవారం ఏఈఈ శ్రీవాణి ఆధ్వర్యంలో అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. టోపో షీట్ ఆధారంగా నాలా పరివాహక ప్రాంతాన్ని గుర్తించి మార్కింగ్ చేపట్టిన అధికారులు, నాలా మార్గంలో వేసిన మట్టిని జేసీబీల సహాయంతో తొలగించారు. ఇరిగేషన్ శాఖ అనుమతులు, సూచనలకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. అయితే అధికారుల చర్యలపై స్థానిక గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న సహజ నాలా ప్రవాహాన్ని పక్కనబెట్టి కొత్తగా మరో మార్గాన్ని నాలాగా చూపించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. అసలు నాలా మార్గాన్ని కాకుండా కొత్త లైన్‌ను మార్కింగ్ చేయడం వెనుక కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు అధికారులు మాత్రం ప్రభుత్వ రికార్డులు, టోపో షీట్లు, సాంకేతిక ఆధారాల ప్రకారమే మార్కింగ్ చేపట్టామని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తుల ఆరోపణలు, అధికారుల వివరణలతో నాలా వివాదం మరింత చర్చనీయాంశంగా మారింది.








# రాహుల్ ఆదర్శప్రాయులు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం

## అందరి సహకారంతోనే అభివృద్ధి : రాహుల్ ఐఏఎస్







భద్రాచలం జూన్ 29 ప్రభాత సూర్యుడుఒక అధికారి ప్రజా సేవను తన శ్వాసగా భావిస్తే ఆ ప్రాంతం ఎలా మారుతుందో చెప్పడానికి భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ ప్రత్యక్ష నిదర్శనం అని శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రశంసించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ హాల్లో నిర్వహించిన ఐటీడీఏ పీవో రాహుల్ రెండేళ్ల పాలన సక్సెస్ మీటిలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత రెండేళ్లలో ఆయన తన కార్యక్షేత్రంలో సృష్టించిన విప్లవాత్మక మార్పులు, వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో నూతన ఆశలను చిగురింపజేశాయి అన్నారు. పరిపాలన అంటే కేవలం ఫైళ్లకు పరిమితం కాదని, అది అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఒక సాధనమని పిఓ రాహుల్ నిరూపించారన్నారు. గిరిజన సంస్కృతికి పట్టం కడుతూనే, ఆధునిక విద్య మరియు ఉపాధి రంగాల్లో మన గిరిజన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా ఆయన చేసిన కృషి అనన్యం అన్నారు. విద్య, వైద్యం, వసతి, క్రీడలు సంస్కృతి అనే ఐదు ప్రధాన సూత్రాలతో ఆయన నిర్మించిన 'గిరిజన వికాస సౌధం' నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందటం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఈ ప్రజా బాంధవుడి ప్రస్థానం, భావి తరాలకు ఒక స్ఫూర్తిదాయక పాఠం అని అభినందించారు

**?అందరి సహకారంతోనే సక్సెస్ : పిఓ రాహుల్**

అందరి సహకారంతోనే భద్రాచలం ఐటీడీఏని ముందుకు తీసుకు వెళ్ళటం జరిగిందని ఐటీడీఏ పీవో బి. రాహుల్ వెల్లడించారు. ప్రధానంగా జిల్లా శాసనసభ్యులు కూడా
ఎంతగానో సహకరించారని తెలిపారు. యూనిట్ అధికారులు కూడా బాధ్యతాయుతంగా పనిచేశారని ప్రశంసించారు. ఐటీడీఏ లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు గిరిజన అభివృద్ధిలో చేయి చేయి కలిపారని తెలిపారు.
విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు 'ఉద్దీపకం' కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీష్, అర్థమెటిక్, తెలుగు భాషలపై పట్టు సాధించేలా ప్రత్యేక పుస్తకాలను రూపొందించడం వల్ల, ఏకంగా 90% మంది విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారన్నారు. ?విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను తీర్చిదిద్దేందుకు కెరీర్ అవేర్ నెస్ ఫ్లెక్సీలను విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయగా అవి ఎంతగానో సక్సెస్ ఇచ్చాయని పేర్కొన్నారు. ??క్రీడల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ వారిని ప్రోత్సహించటం జరిగిందని సత్ఫలితాలు పాజిటివ్ గా వచ్చాయన్నారు. గిరిజన మ్యూజియంను ఆధునీకరించి, 1.5 లక్షల మంది సందర్శకులను ఆకర్షించేలా తీర్చిదిద్దడమే కాకుండా, 'తెలంగాణ రాష్ట్ర గ్రామీణ పర్యాటక పురస్కారాన్ని' ఢిల్లీ నుంచి రూ. 1 కోటి నిధులను అందుకోవటం సంతోషాన్ని ఇచ్చింది అన్నారు. గిరిజన ఇలవేల్పుల చరిత్రను తెలిపే పుస్తకాన్ని వెలుగులోకి తేవటం కూడా సంతోషకరమన్నారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తూ ప్రారంభించిన 'భద్రగిరి మార్ట్', నేడు గిరిజన కుటుంబాలకు ఆర్థిక భరోసానిచ్చే ప్రధాన వేదికగా మారిందన్నారు భద్రాచలం శాసనసభ్యులు ఐటీడీఏ యూనిట్ అధికారులు సిబ్బంది సమక్షంలో ఐటీడీఏ పీవో సాధించిన ప్రగతి పోస్టర్ ఆవిష్కరించారు. అందరి సమక్షంలో రెండు సంవత్సరాలు పూర్తి చేసినందున కేక్ కట్ చేసి ఐటిడిఏ పీఓకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, భద్రాచలం సర్పంచ్ పూనేమ్ కృష్ణ ఇతర శాఖల యూనిటీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాల సమయంలో గిరిజన దర్బార్ లో సమస్యలు తక్షణం పరిష్కరించండి.

భద్రాచలం 29 జూన్ ప్రభాత సూర్యుడు.వర్షాలు పడుతున్న ఎంతో నమ్మకముతో గిరిజన దర్బార్లో వారి సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ఆదివాసి గిరిజన కుటుంబాల సమస్యలు పరిష్కరించడంతో పాటు అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో వివిధ సదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుండి ఆయన యూనిట్ అధికారుల సమక్షంలో అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ వీలైనంత తొందరగా అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలని ఆయన అన్నారు. ఈరోజు గిరిజనులు గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలలో గురుకులం పాఠశాల ఈ ఎం ఆర్ ఎస్ పాఠశాలల్లో సీట్లు ఇప్పించుట కొరకు, పోడు భూముల పట్టాల కొరకు, పట్టాలలో పేర్లు మార్పు కొరకు, రైతుబంధు రుణాల కొరకు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం కొరకు, గిరిజన గ్రామాలలో వ్యవసాయం చేసుకోవడానికి కరెంటు, బోరు, మోటారు కొరకు మారుమూల గిరిజన గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుట కొరకు, నూతనంగా మత్స్యకార సొసైటీలు ఏర్పాటు చేసుకొనుట కొరకు, దీర్ఘకాలిక జబ్బులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం ఇప్పించుట కొరకు, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి వృత్తి శిక్షణలు ఇప్పించుట కొరకు, తమ పంట పొలాలలో బోర్లు వేయించుకోవడానికి అనుమతి కొరకు, సౌర గిరి విద్యుత్ కలెక్షన్లు ఇప్పించుట కొరకు, ఇసుక సొసైటీల సమస్యలు పరిష్కరించుట కొరకు ఇతర ఆర్థిక ప్రయోజనాలు కల్పించుట కొరకు గిరిజనులు అర్జీలు సమర్పించారని ఆయన అన్నారు.



ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక



## జాతీయ ఉపాధి హామీ కింద అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



ప్రభాత సూర్యుడు గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ నల్లబల్లి కొత్తపల్లి గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.70 లక్షలతో చేపట్టనున్న పనులకు పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం నాడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని నాణ్యతతో పనులను గడువుల్లోగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కుమార్, ఎంపీడీవో సుమతి, ఆయా గ్రామాల సర్పంచులు వార్డ్ నెంబర్లు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఈరి పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్



సింగరేణి జూన్ 29 ప్రభాత సూర్యుడు సింగరేణి మండల పరధిలోని అప్పాయిగూడెం పంచాయితీ భిక్య తండా గ్రామానికి చెందిన మండల మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న తల్లి అజ్మీర ఈరి అనారోగ్యంతో మరణించడంతో సోమవారం వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ వారి పార్థివదేహనికి పూల మాల వేసి నివాళులార్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఆత్మకమిటి చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మాలోత్ శకుంతల, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ దారావత్ మంగీలాల్, ఏఎంసి డైరెక్టర్ వాంకుడోత్ నరేష్, నాయకులు భూక్య రాంకిషోర్, జర్పుల ప్రసాద్, బానోతు కోటి, గుగులోత్ హారు, వాంకుడోత్ కరణ్ సింగ్, వాంకుడోత్ విజయ్, జూపల్లి రాము, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి... స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

### ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు



ఖమ్మం, జూన్ –29 ప్రభాత సూర్యుడు.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని  స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.బోనకల్ మండలం ఆళ్లపాడు గ్రామానికి చెందిన ఎం. శ్రీను తనకు గతంలో దివ్యాంగుల పెన్షన్ వచ్చేదని, సదరం సర్టిఫికెట్ చేసినప్పటికీ ఆగిపోయిందని తనకు పెన్షన్ మళ్ళీ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే. నాజియా తన కూతురికి తలసేమియా వ్యాధి ఉందని సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ మంజూరు చేసి దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం హిమాంనగర్ గ్రామ పంచాయతీ ప్రజలు, విద్యార్థుల తల్లి దండ్రులు గ్రామపంచాయతీ ప్రాథమికోన్నత పాఠశాల ఆక్రమణలను తొలగించి విద్యార్థుల సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ రాస్తూ చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. కూసుమంచి మండలం కేశవాపురం గ్రామానికి చెందిన చాగంటి శ్రీదేవి తనకు సర్వే నెంబర్ 591/1/2 లో రెండు ఎకరాల భూమి ఉందని, దానిని అక్రమంగా సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకోవడం జరుగుతుందని, ధరణిలో సర్వే నెంబర్ మిస్ మ్యాచ్ అయిందని, సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కూసుమంచికి  రాస్తూ చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని గడువులోపు పూర్తి చేయాలి : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి..

భద్రాచలం జూన్ 29 ప్రభాత సూర్యుడుఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం--2026లో భాగంగా ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాల పంపిణీని నిర్ణీత గడువులోపు పూర్తి చేసి, ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఫారం అందేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు పినపాక నియోజకవర్గం ఎన్నికల అధికారి, ఐటీడీఏ పీవో బి రాహుల్ ఐటిడిఏ కాన్ఫరెన్స్ హాలు నుంచి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాలను బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) మాత్రమే ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికార వ్యక్తులతో ఫారాల పంపిణీ చేపట్టరాదని ఆదేశించారు.ప్రతి బీఎల్‌వో తన పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి అర్హత కలిగిన ఓటర్లకు ఫారాలను అందజేయడంతో పాటు, వాటిని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోపు సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫారాలను సమర్పించిన ఓటర్ల వివరాలనే ముసాయిదా ఓటరు జాబితాలో కొనసాగిస్తామని, అందువల్ల ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా తన ఫారాన్ని సమర్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అనంతరం పినపాక నియోజకవర్గం ఎన్నికల అధికారి బి రాహుల్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. బూర్గంపాడు మండలంలో సారపాక 211,216,274,235, మణుగూరు మండలంలో 22,82,94,106,141,190, అశ్వాపురం మండలంలో 160,163,166,169 ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ శాతం చాలావరకు తగ్గిందని బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, నిర్ణీత గడువులోపు వాటిని తిరిగి సేకరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఫారాల పంపిణీ స్వీకరణ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను పిఓ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, పి వి టి జి అధికారి గన్యా,  తహసిల్దార్లు నరేష్, రామకృష్ణ , సూర్య ప్రకాష్, ఎలక్షన్ డిటి అనూష, ఆర్ ఐ లీలావతి శాఖ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు..






## మేడ్చల్ మెట్రో ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి నిరాశాజనకం

### మెట్రో సాధన సమితి ఉద్యమానికి పూర్తి మద్దతు : ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద



కొంపల్లి, జూన్ 29 ప్రభాత సూర్యుడు: మేడ్చల్ మెట్రో రైలు ప్రాజెక్టు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ఎల్పీ విప్ కే.పీ. వివేకానంద విమర్శించారు. మేడ్చల్ మెట్రో రైలు సాధన సమితి ప్రతినిధులతో కలిసి కొంపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మేడ్చల్ మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మెట్రో ప్రాజెక్టు అమలుపై స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల ప్రజల్లో నిరాశ నెలకొందన్నారు.ప్రజల దృష్టి మళ్లించేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో విభేదాలు ఉన్నట్లు చూపించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు. ఢిల్లీలో కేంద్ర నాయకులతో ఒక విధంగా, రాష్ట్రంలో మరో విధంగా వ్యవహరించడం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమని పేర్కొన్నారు. ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో కొనసాగిన మెట్రో ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాత దాని పురోగతి మందగించిందని, అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. మల్కాజిగిరి నియోజకవర్గానికి గతంలో ప్రాతినిధ్యం వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మేడ్చల్ మెట్రో రైలు సాధన సమితి చేపట్టే ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మెట్రో ప్రాజెక్టు అమలుకు ప్రజాస్వామ్యబద్ధంగా ఒత్తిడి తీసుకొచ్చేలా కార్యాచరణ చేపడతామని ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద తెలిపారు. ఈ సమావేశంలో మేడ్చల్ మెట్రో రైలు సాధన సమితి ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## భౌతిక కాయానికి నివాళులర్పించిన సర్పంచ్ దండు ప్రవీణ్.


### చేయూతగా ఆర్థిక సాయం అందజేత.

సింగరేణి   29 ప్రభాత సూర్యుడింగరేణి మండల పరిధిలో అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని భిక్య తండా గ్రామంలో అనారోగ్యంతో మరణించిన అజ్మీరా ఈరి  భౌతిక కాయానికి నివాళులర్పించడం జరిగింది.అలాగే వారి కుటుంబానికి సానుభూతి సూచకంగా సంత్వన నిధి క్రింద రూ.5,000/- ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ దండు ప్రవీణ్ , ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి , వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీ దండు ప్రవీణ్ మాట్లాడుతూ క్లిష్ట సమయంలో అజ్మీరా ఈరి  కుటుంబానికి గ్రామ పంచాయతీ తరపున అండగా ఉంటానని కుటుంబ సభ్యులు ధైర్యంగా, మనోధైర్యంగా ఉండాలని భగవంతుడు మృతుని ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని  కోరారు.



## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం





మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ జూన్ 29ప్రభాత సూర్యుడు ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 95 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకంతో సమయం, ధనం వెచ్చించి ప్రజావాణికి వస్తారని అన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే, దరఖాస్తులను తిరస్కరించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా, వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్



జూన్ 29ప్రభాత సూర్యుడు ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రతిక్ జైన్ హెచ్చరించారు! సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు తదిరులు పాల్గొన్నారు.

## కారేపల్లి లో ముమ్మరంగా సర్ ఓటర్ల జాబితా

సింగరేణి జూన్ 29 ప్రభాత సూర్యుడుకారేపల్లిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్  ఏజెంట్ బి.ఎల్.ఓ, బి ఎల్ ఏ లు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ రాజమణి, బి ఎల్ ఏ లు యాకుబ్ ఆలీ, ఆదేర్ల రాములు, కారేపల్లి గ్రామ ఆరవ వార్డు సభ్యులు ఆదేర్ల అంజయ్య పాల్గొని సవరణ చేపట్టారు. ఈ సందర్భంగా బిఎల్వో మాట్లాడుతూ స్వతంత్రంగా, 1987 నుండి 2004 మధ్యలో పుట్టిన వారు స్వతంత్రంతో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి, 2004 తర్వాత పుట్టిన వారు స్వతంత్రంతోపాటు తల్లిదండ్రులు, లేకపోతే తాత, నా నంబర్ ధ్రువీకరణ ఆధారతో పాటు సమర్పించాలని కోరారు. రెండు ఫారాలు అందజేయడంతో ఫారాన్ని నింపి ఒక ఫారం అందివ్వాలని కోరారు. మ్యాపింగ్ అయినవారు ఎటువంటి డాక్యుమెంట్ సమర్పించవలసిన అవసరం లేదని, మ్యాపింగ్ కాని వారు 11 రకాల ధ్రువీకరణతో ఏదో ఒకటి సమర్పించాలని ఓటర్లకు తెలిపారు.





# దేవర తర్వాత మళ్లీ కలయిక.. 'గాడ్ అఫ్ వార్ 'పై భారీ హైప్!

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రాబోయే భారీ మైథలాజికల్ ఫిల్మ్ 'గాడ్ ఆఫ్ వార్' అఫీషియల్ అనౌన్స్‌మెంట్‌కు టైమ్ ఫిక్స్ అయింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రాబోయే భారీ మైథలాజికల్ ఫిల్మ్ 'గాడ్ ఆఫ్ వార్' అఫీషియల్ అనౌన్స్‌మెంట్‌కు టైమ్ ఫిక్స్ అయింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా కన్ఫర్మ్ అవ్వడంతో ఇండస్ట్రీలో హైప్ నెక్స్ట్ లెవెల్‌కి వెళ్ళింది. 'దేవర' లాంటి గ్లోబల్ హిట్ తర్వాత ఎన్టీఆర్, అనిరుధ్ కాంబోలో వస్తున్న రెండో సినిమా కావడంతో సోషల్ మీడియా మొత్తం ఈ క్రేజీ అప్‌డేట్‌తో ఊగిపోతోంది. గతంలో ఎన్టీఆర్, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన 'అరవింద సమేత వీర రాఘవ' ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇక తారక్ పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్, త్రివిక్రమ్ లోతైన డైలాగ్స్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించాయి.



ఇప్పుడు మళ్లీ ఇన్నాళ్ల తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాలు ఒక పౌరాణిక నేపథ్యం ఉన్న కథతో జతకడుతుండటంతో సరికొత్త రికార్డుల వేట మొదలవడం ఖాయంగా కనిపిస్తోంది. అనిరుధ్‌కు ఫస్ట్ టైమ్ మైథలాజికల్ ఎక్స్‌పీరియన్స్:స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఇప్పటివరకు ఎన్నో కమర్షియల్, మాస్ యాక్షన్ సినిమాలకు అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు. గతం లో ఎన్టీఆర్ తో దేవర మూవీ తో హిట్ కాంబో అనిపించుకున్నాడు. కానీ ఆయన కెరీర్‌లోనే ఒక భక్తి లేదా పౌరాణిక చిత్రానికి సంగీతం అందించడం ఇదే మొదటిసారి. ఇక లార్డ్ మురుగన్ కాన్సెప్ట్‌తో రాబోతున్న ఈ 'గాడ్ ఆఫ్ వార్' చిత్రానికి అనిరుధ్ ఎలాంటి డివోషనల్ అండ్ పవర్‌ఫుల్ ట్యూన్స్ ఇస్తారో చూడాలని అటు మ్యూజిక్ లవర్స్, ఇటు నందమూరి ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ అల్టిమేట్ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థలు హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి.ఇక నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో ఇచ్చిన హింట్స్‌తో అభిమానులు అప్పుడే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో హ్యాష్‌ట్యాగ్స్ ట్రెండ్ చేస్తూ హంగామా మొదలుపెట్టారు. ఎట్టకేలకు ఈరోజు సాయంత్రం 5:04 గంటలకు అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇవ్వనున్నారు. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్, త్రివిక్రమ్ మేధస్సు, అనిరుధ్ మ్యూజిక్ మ్యాజిక్...

## బాలయ్య సినిమా ఆ డెడ్‌లైన్ ను అందుకుంటుందా?



ప్రస్తుతం సినిమా షూటింగ్ కీలక దశలో కొనసాగుతోంది. భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ప్రధాన తారాగణానికి సంబంధించిన సీన్స్, సాంగ్స్ షూటింగ్ వంటి పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తవ్వాల్సి ఉంది టాలీవుడ్‌లో పండుగ సీజన్‌కు సినిమాను రిలీజ్ చేయడమనేది కేవలం రిలీజ్ డేట్ సెలెక్షన్ మాత్రమే కాదు.. అది ఒక బిజినెస్ స్ట్రాటజీ కూడా. ముఖ్యంగా దసరా, సంక్రాంతి, సమ్మర్ వంటి సీజన్లలో ఆడియన్స్ నుంచి వచ్చే రెస్పాన్స్, థియేటర్లలో లభించే అవకాశాలు, ఫ్యామిలీ ఆడియన్స్ ఫుట్‌ఫాల్ వంటి అంశాలు నిర్మాతలకు భారీ ప్రయోజనాన్ని అందిస్తాయి. అందుకే ఇప్పుడు బాలకృష్ణ నటిస్తున్న చీదీఖ111 సినిమాను కూడా దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే టార్గెట్ తో చిత్రబృందం వేగంగా పనులు పూర్తి చేస్తోందని సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ కీలక దశలో కొనసాగుతోంది. భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ప్రధాన తారాగణానికి సంబంధించిన సీన్స్, సాంగ్స్ షూటింగ్ వంటి పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తవ్వాల్సి ఉంది. దసరా రిలీజ్‌ను అందుకోవాలంటే పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా పూర్తి చేయాల్సి ఉండటంతో మేకర్స్ ఎక్కడా రాజీ పడకుండా దసరా టార్గెట్ ను అందుకోవాలని ప్లానింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పెద్ద సినిమాల్లో చిన్న ఆలస్యం కూడా మొత్తం రిలీజ్ షెడ్యూల్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో మేకర్స్ ప్రతి దశను జాగ్రత్తగా ముందుకు తీసుకెళ్తోంది. ఇటీవలి కాలంలో పండుగ సీజన్‌లను టార్గెట్ గా చేసుకుని స్టార్ హీరోలు వరుసగా తమ సినిమాలను రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే. అలాంటి సమయంలో చీదీఖ111 కూడా దసరా బరిలో నిలిస్తే బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. దసరా టైమ్ కు మరికొన్ని సినిమాలు కూడా రిలీజ్ కు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇతర భారీ సినిమాలు కూడా అదే సీజన్‌ను టార్గెట్ చేస్తే థియేటర్ల కేటాయింపు, షోల పంపిణీ, సినిమా ఓపెనింగ్స్ మరియు ఫస్ట్ వీకెండ్ కలెక్షన్లపై ప్రభావం పడే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే బాలకృష్ణకు పండుగ సీజన్‌లో విడుదలైన మాస్ ఎంటర్‌టైనర్లు మంచి ఆదరణ పొందిన సందర్భాలు గతంలో చాలానే ఉన్నాయి. అందుకే ఈసారి కూడా అదే సెంటిమెంట్‌ను కొనసాగించాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో ఇప్పటికే సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ ఉండటం, ఇప్పటికే సినిమా నుంచి రిలీజైన కంటెంట్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ రావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఒకవేళ ఏదైనా ఆలస్యమై సినిమా అనుకున్నట్టు దసరా టైమ్ కు రాకపోతే రిలీజ్ డేట్ ను కాస్త వెనక్కి జరిపి డిసెంబర్ 4వ తేదీన రిలీజ్ చేయాలని కూడా టీమ్ ప్లాన్-బి ని కూడా రెడీ చేసుకున్నట్టు తెలుస్తోంది. మేకర్స్ మొదటి ప్రాధాన్యం మాత్రం దసరా మార్కెట్‌పైనే ఉందని తెలుస్తోంది. దీంతో ఇప్పుడందరి దృష్టి మేకర్స్ షూటింగ్ డెడ్‌లైన్‌ను అందుకుంటారా? లేక బాక్సాఫీస్ పోరాటం మరికొంత ఆలస్యంగా మొదలవుతుందా? అనే దానిపై నెలకొంది.

# డిప్యూటీ సీఎం త్రిష...నిజమేనా ?



ఇపుడు దేశంలో డిప్యూటీ సీఎంల లిస్ట్ పెరుతోంది. ఈ పోస్టులలోకి వస్తున్న వారు కూడా క్రేజ్ ఉన్న వారే ఉంటున్నారు.ఇపుడు దేశంలో డిప్యూటీ సీఎంల లిస్ట్ పెరుతోంది. ఈ పోస్టులలోకి వస్తున్న వారు కూడా క్రేజ్ ఉన్న వారే ఉంటున్నారు. ఒకపుడు ఎపుడో రాజకీయ సర్దుబాటులో భాగంగా ఈ పదవులు చాలా అరుదుగా క్రియేట్ చేసేవారు. ఇపుడు మాత్రం సీఎం పక్కన డిప్యూటీ ఉండాల్సిందే. అలా కాకుండా తొమ్మిదేళ్ళ ఏకచత్రాధిపత్యంగా ఉమ్మడి ఏపీని ఏలిన చంద్రబాబు కూడా విభజన ఏపీలో డిప్యూటీ సీఎంలను పెట్టుకున్నారు. జగన్ తొలిసారి సీఎం అయినా వెంట అయిదుగురు డిప్యూటీలు ఉండేవారు. ఇక తమిళనాడులో కూడా డిప్యూటీ సీఎంల వరస డీఎంకే నుంచే స్టార్ట్ అయింది. కరుణానిధికి స్టాలిన్, అలాగే స్టాలిన్ కి ఉదయనిధి డిప్యూటీలుగా పనిచేశారు. మరి తమిళనాడులో ద్రవిడ పార్టీల రాజకీయానికి ముగింపు పలికి కొత్త రాజకీయానికి బాటలు వేసిన దళపతి విజయ్ కేబినెట్ లో కూడా డిప్యూటీ సీఎం ఉంటారారా అన్న చర్చ నడుస్తోంది.మూడు దేశాల్లో మూడు దారుణ ఘటనలు ఆమె ఆ పదవిలో : ఇక విజయ్ సీఎం గా ఉంటే డిప్యూటీ ఎవరు అంటే ఎవరో కాదు ఆమె డిప్యూటీ సీఎం అవుతారు అని విపక్షం జోస్యం చెబుతోంది. త్రిషను తొందరలో డిప్యూటీ సీఎం గా చేసేట్టు ఉన్నారు అని అన్నది అన్నా డీఎంకేకి చెందిన మాజీ మంత్రి ఉదయకుమార్. ఆయన జోస్యంగా కంటే సెటైరికల్ గా ఈ కామెంట్స్ చేశారు. విజయ్ ధోరణి చూస్తుంటే తన సినీ సన్నిహితులను స్నేహితులను తెచ్చి కీలక పదవులు కట్టబెడుతున్నారు అని ఉదయకుమార్ మండిపడ్డారు. ఆయన ఆగ్రహానికి కారణం తాజాగా ఢిల్లీలో తమిళనాడు ప్రభుత్వ ప్రతినిధిగా కన్నడ రాష్ట్రానికి చెందిన ప్రముఖ నిర్మాత కేవీఎన్ ప్రొడక్షన్స్ అధినేత వెంకట నారాయణ్ ని సీఎం విజయ్ నియమించారు. దాంతో పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగుతున్నాయి. ఎనిమిది కోట్ల దాకా జనాభా ఉన్న తమిళనాడులో ఈ కీలక పోస్టుకు ఒక్క తమిళుడు దొరకలేదా అని అంతా విమర్శిస్తునారు. దాంతో అన్నా డీఎంకే దీనిని పట్టుకుని విజయ్ మీద విమర్శలు తనదైన శైలిలో ఎండగట్టింది. త్రిషకు కూడా ఇచ్చేస్తారు : తన సన్నిహితులకు పదవులు కట్టబెట్టే క్రమంలో రాబోయే రోజులలో త్రిషను ఉప ముఖ్యమంత్రిగా చేసినా ఆశ్చర్యం లేదని మాజీ మంత్రి ఉదయకుమార్ ఘాటైన కామెంట్స్ చేశారు. ఆయన చేసిన ఈ కామెంట్స్ అయితే ఇపుడు తమిళనాడులో టాక్ ఆఫ్ ది స్టేట్ గా మారిపోయాయి. త్రిష విజయ్ వెండి తెర మీద క్రేజీ జంట. ఇపుడు ఆ ఇద్దరికీ కలిపి సీఎం డిప్యూటీ సీఎం అని ఉదయకుమార్ పేల్చిన సెటైర్ అయితే బాగా మారు మోగుతోంది. కుదిరే వ్యవహారమేనా అయితే త్రిష ఉప ముఖ్యమంత్రి కావాలంటే ఆమె ఎమ్మెల్యేగా ముందు గెలిచి తీరాలి. తమిళనాడులో శాసనమండలి లేదు. అయితే విజయ్ రాజీనామా చేసిన తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుంచి ఆమె పోటీ చేయాలి. ఆ మేరకు ఆమెకు టికెట్ ఇస్తేనే రేపటి రోజున కేబినెట్ లో చోటు దక్కుతుంది.

## 'విశ్వనాథ్ & సన్స్' కోసం గాయకుడిగా మారిన స్టార్ హీరో ?




తమిళ హీరో సూర్య 'కరుప్పు' విజయంతో జోరుమీదున్నాడు. ప్రస్తుతం తన తదుపరి సినిమా 'విశ్వనాథ్ ఌ సన్స్' చిత్రంతో ప్రేక్షకులను అలరించడానికి ఆయన రెడీ అవుతున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటిస్తోంది. ఐతే, సూర్య అభిమానుల కోసం సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఓ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. ఈ చిత్రం కోసం సూర్య ఒక ప్రత్యేకమైన డ్యాన్స్ నంబర్‌ను (పాటను) పాడారని ఆయన వెల్లడించారు.'యూత్' సినిమాతో గుర్తింపు పొందిన నటుడు, దర్శకుడు మరియు గీత రచయిత కెన్ కరుణాస్ ఈ పాటను రచించారు. 2014లో వచ్చిన 'అంజన్' చిత్రంలోని 'ఏక్ దో తీన్' పాట తర్వాత, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతంలో సూర్య మళ్లీ గాయకుడిగా మారడం విశేషం. ఈ వార్త మొత్తానికి సూర్య అభిమానులలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది.

## 'గాడ్ ఆఫ్ వార్' అప్ డేట్ కి టైమ్ లాక్ !



ఎన్టీఆర్ అభిమానులు చాలా కాలంగా ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రకటన ఈ రోజే ఉంటుందని నిర్మాత నాగ వంశీ ఇప్పటికే ధృవీకరించారు. ఎన్టీఆర్ తో 'అరవింద సమేత' తర్వాత దర్శకుడు త్రివిక్రమ్ చేస్తున్న సినిమా 'గాడ్ ఆఫ్ వార్'. ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ అప్ డేట్, ఈ రోజు సాయంత్రం 5:04 గంటలకు రాబోతుంది. ఎన్టీఆర్ నుంచి రానున్న అప్ డేట్ కి టైమ్ లాక్ అయ్యాక, అభిమానుల్లో ఉత్సాహం తారాస్థాయికి చేరింది.ఇంతకీ, ఎనౌన్స్ మెంట్ పోస్టర్ వదులుతారా ?, లేక ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తారా ?, కేవలం సినిమాని ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తారా ?, లేక మరో సర్‌ప్రైజ్ ఉంటుందా ? అనేది చూడాలి. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం అత్యంత భారీ స్థాయిలో రూపొందుతోంది

## దీవాన బాక్సాఫీస్.. వీకెండ్ తర్వాత కూడా అలానే..



హర్షిత్ రెడ్డి, స్నేహ మణిమేగలై నటించిన దీవాన సినిమా జూన్ 20న థియేటర్లలోకి వచ్చిన సంగతి తెలిసిందే.హర్షిత్ రెడ్డి, స్నేహ మణిమేగలై నటించిన దీవాన సినిమా జూన్ 20న థియేటర్లలోకి వచ్చిన సంగతి తెలిసిందే. శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వంలో ఒక స్వచ్ఛమైన ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పుడు రెండో వారంలోకి అడుగుపెట్టింది. సాధారణంగా ఎలాంటి పెద్ద స్టార్ కాస్ట్ లేని చిన్న సినిమాలకు తొలి వీకెండ్ తర్వాత థియేటర్ల దగ్గర సందడి పూర్తిగా తగ్గిపోతుంది. కానీ దీవాన విషయంలో అలా జరగకుండా బాక్సాఫీస్ దగ్గర చాలా స్టెడీగా రన్ అవుతుండటం హైలెట్. కొత్త వాళ్లతో తీసిన లవ్ స్టోరీలకు పబ్లిక్ నుంచి వచ్చే మౌత్ టాక్ చాలా కీలకం అవుతుంది. ఈ సినిమాకు మొదటి రోజు నుంచే ఆడియన్స్ నుంచి పాజిటివ్ వైబ్ రావడంతో ఆ ఎఫెక్ట్ ఇప్పుడు థియేటర్ల దగ్గర క్లియర్ గా కనిపిస్తోంది. భారీ ఎత్తున ఓపెనింగ్స్ రాకపోయినా కంటెంట్ నచ్చడంతో జనాలు నెమ్మదిగా థియేటర్ల వైపు వస్తున్నారు. వీకెండ్ హాలిడేస్ పూర్తయిన తర్వాత కూడా సోమవారం లాంటి వర్కింగ్ డేస్ లో డీసెంట్ కలెక్షన్స్ వస్తుండటం మేకర్స్ కు పెద్ద రిలీఫ్ ఇస్తోంది. ఆన్లైన్ టికెటింగ్ ప్లాట్ ఫామ్ బుక్ మై షో లో గమనిస్తే ఈ సినిమా బుకింగ్స్ పరిస్థితి చాలా పాజిటివ్ గా ఉన్నట్లు తెలుస్తోంది. వీకెండ్ హడావుడి తగ్గిన తర్వాత కూడా చాలా ఏరియాల్లో టికెట్లు ఆశాజనకంగానే అమ్ముడవుతున్నాయి. గత 24 గంటల్లో బుకింగ్స్ లెక్క 6.82ని రేంజ్ లో ఉండడం విశేషం. ఆడియన్స్ నుంచి వస్తున్న కంటిన్యూస్ రెస్పాన్స్ తో ఈ యాప్ లో సినిమా ట్రెండింగ్ లోనే కొనసాగుతోంది. దీన్ని బట్టి కేవలం యూత్ మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఈ సినిమాను చూడటానికి బాగానే ఆసక్తి చూపిస్తున్నారని మనకు అర్థమవుతోంది. ఒక యువకుడు తన ప్రేమ కోసం పడే ఆరాటం ఆ తర్వాత అనుకోకుండా పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడం లాంటి పాయింట్స్ నేటి జనరేషన్ కు బాగా కనెక్ట్ అయ్యాయి. దర్శకుడు ఎంచుకున్న కథలో ఉన్న రియాలిటీకి కాస్త కమర్షియల్ హంగులు కూడా తోడవడంతో సినిమా బోర్ కొట్టకుండా సాగుతుంది. ముఖ్యంగా సినిమా సెకండాఫ్ లో వచ్చే ఎమోషనల్ సీన్స్ ప్రేక్షకులను ఆలోచింపజేసేలా ఉండటం ఈ సినిమా స్టెడీ రన్ కు అసలైన కారణం అని చెప్పవచ్చు. సినిమా రిలీజ్ తర్వాత నెగటివ్ ప్రచారంపై డైరెక్టర్ చేసిన ఎమోషనల్ కామెంట్స్ కూడా సినిమాకు ఒక రకంగా ప్లస్ అయ్యాయి. కంటెంట్ మీద పూర్తి నమ్మకంతో సినిమా తీశామని థ్యాంక్యూ మీట్ లో మూవీ టీమ్ పదే పదే చెప్పడంతో జనాల్లో కూడా ఈ సినిమా కచ్చితంగా చూడాలనే క్యూరియాసిటీ పెరిగింది.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555